# రుక్మిణీ కళ్యాణం

"అబ్బాయి అందగాడు -- బాగా చదువుకున్నవాడు..."

"..... సంస్కారం అదీ ఉన్నవాడు. నేను కాదనటంలేదు. కానీ మన అమ్మాయి జాతకంతో ఆ అబ్బాయి జాతకం ఏ మాత్రం సరిపడటంలేదు. ఏం చేయమంటావ్?" విసుగ్గా అన్నాడు విశ్వనాథం, సోమిదేవి పదహారోసారి గొణగటం విన్నాక.

భయపడుతూనే, నెమ్మదిగా అంది సోమిదేవి - "మిగతావన్నీ సలక్షణంగా వున్నప్పుడు, జాతకం ఒక్కటే కలవకపోతే ఏమండీ -- రుక్మిణికి అప్పుడే ఇరవై నాలుగో సంవత్సరం వచ్చింది. ఇంకా దానికి పెళ్ళవకపోతే ఈ పల్లెటూళ్ళో నలుగురూ ఏమంటారు?- దాని తర్వాత దానికి, దమయంతికి, అప్పుడే ఇరవై రెండేళ్లు - ఇక దానికి పెళ్ళి ఎప్పుడు అయేటట్టు!"

విశ్వనాథం చట్టుక్కున తల ఎత్తాడు.

"ఎప్పుడు రాసిపెట్టివుంటే అప్పుడే అవుతుంది. ఇన్నాళ్ళూ రుక్మిణికి పెళ్ళికాకపోవటం అన్నది మన ప్రయత్నలోపం వల్ల కాదు. భగవత్సంకల్పం లేకపోవటంవల్ల. నేను ఆరేళ్ళ నుంచీ, కాళ్ళకి బలపాలు కట్టుకుని నెల్లూరు దగ్గర నుంచి శ్రీకాకుళం దాకా తిరుగుతునే వున్నానా? ఏమయింది? దానికి రాసిపెట్టిన వాడెక్కడున్నాడో యింకా భగవంతుడు మనకు చూపించలేదు. అంటే దాని పెళ్ళికి యింకా సమయం ఆసన్నమవలేదన్నమాట. కక్కొచ్చినా కల్యాణమెచ్చినా ఆగదు. ఆ శివుడి ఆజ్ఞ అవనీ - ఆ పెళ్ళికొడుకే మనింటికి వస్తాడు".

"ఆ వస్తాడు-వస్తాడు. జాతకం కలవలేదని బంగారంలాంటి గుంటూరు సంబంధం వదులుకున్నారు. గోత్రం కలిసిందని అన్ని విధాలా బాగున్న గుడివాడ సంబంధం కాదనుకున్నాం. ఋషులు కలిశారని రాజమండ్రీ సంబంధానికి నీళ్ళు వదిలాం. ఆ అబ్బాయి వాళ్ళ అమ్మమ్మకి బొల్లి వుందని విశాఖపట్టణం సంబంధం కాదన్నాం. ఆ అబ్బాయి వాళ్ళ మేనత్త కిరస్తానీవాడితో లేచిపోయిందని ఒంగోలు సంబంధం కాదన్నాం---"

"అయితే ఏమంటావ్ -- నీకున్న బాధ, బాధ్యతా నాకు లేదంటావా? ఏదో కారణం లేకుండా నే నే సంబంధమూ త్రిప్పికొట్టలేదు. దాని సుఖమే నా సుఖం. ఇలాంటి పిచ్చి ఆలోచనలు మనసులో పెట్టుకోకు, ఆరోగ్యానికి మంచిది కాదు!" - విసురుగా అంటూ, ఉత్తరీయం భుజాన వేసుకుని, గ్రామ చావడి వేపు నడిచాడు విశ్వనాథం.

సోమిదేవి పైట చెంగుతో కళ్ళు తుడుచుకుంది.

మధ్య గదిలో ఉయ్యాల బల్ల మీద కూర్చున్న రుక్మిణి అంతా విని, ఒక్కసారి నిట్టూర్చింది. నిట్టూర్చటం అయిపోయాక -- చేతిలోవున్న 'రుక్మిణీ కళ్యాణం' ఏడొందల అరవై నాలుగోసారి చదవటం ప్రారంభించింది.

అప్పుడే తల స్నానం చేసి వచ్చిన దమయంతి, విరబోసుకున్న తడి వెంట్రుకలను తుడుచుకుంటూ అన్నది---

"అక్కయ్యా--- 'రుక్మిణీ కళ్యాణం' చదివితే తొందరగా పెళ్ళవుతుందని, నాన్న, అమ్మా, మన పురోహితుడూ, అందరూ చెబుతారు కదా - నువ్వు ఎన్నో సంవత్సరాల నుంచీ చదువుతున్నా నీకు యింకా పెళ్ళికావటంలేదేమిటే?"

దమయంతి అమాయకంగానే అడిగినా, రుక్మిణికి ఉక్రోషం వచ్చింది---

"నేను ఆ పుస్తకం చదివేది --- తొందరగా పెళ్ళవటానికి కాదు. యింట్లో వేరే యింకే పుస్తకాలు లేక-తెలిసిందా-ఇక నోరు మూసుకుని వెళ్ళి నీ పని చూసుకో" - కోపంగా అని మూతి ముడుచుకున్నది రుక్మిణి---

" సరేలే అమ్మా-నీకు పెళ్ళి కావటంలేదని ఆ కోపం నా మీద చూపిస్తే ఎలా..." సణుక్కుంటూ వెళ్ళిపోయింది దమయంతి.

దమయంతి వెళ్ళిన తర్వాత దీర్ఘంగా ఆలోచిస్తూ కూర్చుంది రుక్మిణి.

నిజంగానే వేరే పుస్తకాలు లేకనే తను యిన్ని సార్లు 'రుక్మిణీ కళ్యాణం' చదువుతున్నదా? తను చెప్పింది అబద్ధం అని తన మనసుకి తెలుసు- వేరే పుస్తకాలు లేకేం --

'ద్రౌపదీ వస్త్రాపహరణం,' 'సుమతీ శతకం' - యిలా చాలా వున్నాయి. కానీ యీ పుస్తకమంత బాగుండవు అవి. నాన్న తననేమో ఎక్కువ చదివించలేదు. అయిదో క్లాసు అవగానే, 'ఆడపిల్లలకు చదువేమిటి--- రేపో --- ఎల్లుండో ఒక అయ్య దగ్గరకు పోవలసిన పిల్ల' అని చదువు ఆపించేశాడు. ఆ పల్లెటూళ్ళో వేరే హైస్కూలు లేదు కనుక, అమ్మ కూడా పంపటానికి ఇష్టపడలేదు. ఏదో 'రుక్మిణీ కళ్యాణం' చదవగలిగితే చాలదా అని కూడా అన్నది. అంతే! అప్పటి నుంచి ఇప్పటి దాకా తను 'రుక్మిణీ కళ్యాణం' మాత్రమే చదువుతున్నది. అయిదారేళ్ళనుంచీ ఎన్నో సంబంధాలు చూస్తున్నాడు నాన్న. కాలం, కర్మం కలసిరాక, ఇంతవరకూ ఏదీ కుదరలేదు. కొన్ని గోత్రాలు కలసి, వేరే గోత్రాలయినా ఋషులు కలసి, జాతకాలు కలవక, ఇద్దరూ జ్యేష్ఠులే అయి--- ఇలా ఏదో ఒక కారణాన ఏదీ కుదరటంలేదు. ఒకటీ, రెండూ అన్నీ కలసినా, అమ్మాయికి చదువు లేదనీ, పల్లెటూరి పిల్ల అనీ, తప్పి పోయాయి. నాన్న కట్నం యెంతయినా ఇవ్వటానికి సిద్ధంగా వున్నాడు. అయినా..... ఏమో...... ఎప్పటికో ..... ఆలోచనలను బలవంతాన ఆపుకుని పుస్తకాన్ని తెరచి, లీలామానుష విగ్రహ వర్ణన చదువుతూ, తన్మయత్వంతో కళ్ళు మూసుకుంది రుక్మిణి.

★ ★ ★

" బాబాయి --- నువ్వేమయినా అను-- అమ్మాయిని ఇలా ఇన్నాళ్ళు వుంచటం మాత్రం నాకు నచ్చలేదు " - దశరధరామయ్య అంటున్నాడు.

గ్రామచావడిలో కూర్చుని, చుట్ట త్రాగుతున్న విశ్వనాధం -- "ప్ ....ప్"మని రెండుసార్లు పీల్చి, పొగ వదిలి నెమ్మదిగా అన్నాడు-

"ఒక పని చేయరా రాముడూ -- రుక్మిణి పెళ్ళి. విషయం అంతా నీకే వదిలేస్తాను. మంచి సంప్రదాయం, అందం, ఆస్తి, అన్నీ వున్న చక్కటి సంబంధం చూచి, చెప్పు. ఆ

మూడు ముళ్ళూ త్వరలో వేయించేద్దాం!"

"అంత బాధ్యత నా మీద పెట్టకు బాబాయ్. మీరంతా పెద్దవాళ్ళు. నేను ఏదో నాకు తోచింది అన్నాను. నీకు తెలియని మంచి చెడులు మాకేం తెలుస్తాయి. అయినా అడిగావు కనక చెబుతున్నాను. తెనాలిలో పూర్ణచంద్రరావ్ గారని వున్నారు. మనవాళ్ళే---- బాగా డబ్బు అదీ వున్నవాడు-- వారి పెద్ద అబ్బాయి-- డాక్టరు చదివాడు- ఎర్రగా బుర్రగా వుంటాడు. అమ్మాయి తప్పక సుఖపడుతుంది-- ఏమంటావ్ కనుక్కుందామా?" అడిగాడు దశరథ రామయ్య.

"శుభం! కనుక్కో-- రేపు సప్తమి కూడాను. చాలా మంచిది. రేపే కనుక్కొచ్చి చెప్పు--- " అన్నాడు విశ్వనాథం ఉత్సాహంగా.

"తప్పకుండాను-- నీకామాత్రం సహాయం చేయలేకపోతానా?" అన్నాడు దశరథరామయ్య లేస్తూ.

మర్నాడు సాయంత్రం విశ్వనాథం, దశరథరామయ్య రాక కోసం ఎదురు చూస్తూ, వాకిట్లో అరుగు మీద పడక్కుర్చీ వేసుకుని కూర్చున్నాడు. మాటి మాటికీ రోడ్డు వేపుచూస్తున్నాడు.

సోమిదేవి ఇంటి పనిలో వున్నా, ఖాళీ దొరికినప్పుడల్లా వాకిట్లోకి తొంగిచూసి, లోపలికి పోతున్నది.

పల్లె టూళ్ళలో సాయంత్రం ప్రకృతి సౌందర్యాలు చూడాలని వున్నా ఆడవారు రోడ్ల మీద తిరగరు. తిరిగితే నలుగురూ నానా విధాల అనుకుంటారు. కానీ రుక్మిణి ఆ రోజు అలా షికారుగా వెళ్లాలనుకుంది. అందుకే చేతిలో 'చెంబు' పట్టుకుని 'అలా' పొలాల గట్టుకని బయల్దేరింది.

సాయంత్రం కాస్తా రాత్రిలా మారిపోయింది.

అయినా విశ్వనాథం, పడక్కుర్చీలోనించి లేవలేదు.

సోమిదేవి వచ్చి ఆయన దగ్గరగా, చాప మీద కూర్చున్నది మాట్లాడకుండా.

ఆవిడ వెనకగా దమయంతి కూర్చుని జడలోని సన్నజాజుల మాలను సర్దుకుంటున్నది. రుక్మిణి మాత్రం, ఉయ్యాల బల్ల మీద పడుకుని ఏదో ఆలోచిస్తున్నది.

అప్పుడే వచ్చాడు దశరథరామయ్య.

రాగానే 'హుష్' మంటూ నులక మంచం మీద కూర్చుని, భుజాన వున్న ఉత్తరీయం, వళ్ళో వేసుకున్నాడు.

సోమిదేవి ఇచ్చిన చల్లటి నీళ్ళు గడ గడా త్రాగి, "తెనాలి వెళ్లొచ్చాను బాబాయ్" అన్నాడు.

"ఏమయింది?" అన్నాడు విశ్వనాథం -- ఎంతో కుతుహలంగా.

"పిల్లవాడ్ని చూశాను. చాల బాగున్నాడు. అందగాడి క్రిందే లెఖ్క -- డాక్టరు. బాగానే సంపాదిస్తున్నాడు కూడాను. మంచి సంప్రదాయం. అన్నీ వున్నవాళ్ళేను...."

"అది సరేలేవయ్యా, అవన్నీ ముందే తెలిసిన విషయాలేకదా -- మన అమ్మాయిని చూట్టానికి ఎప్పుడు వస్తామన్నారు. అది చెప్పు ముందు?" అసహనంతో అడిగాడు విశ్వనాథం.

"వాళ్ళేం వస్తారు బాబాయి -- అతనికి ఉద్యోగం చేసే భార్య కావాలిట. డాక్టర్ చదివిన దయితే వేరే ఏం అభ్యంతరాలూ లేవుట. ఆర్థికంగా స్త్రీ తన కాళ్ళ మీద నిలబడగలగాలి అన్నాడు. ఇక మన రుక్మిణి గురించి నేను ఏమీ చెప్పకుండానే వచ్చేశాను. రోజులు మారుతున్నాయి బాబాయ్ -- మనమూ మారాలి. ఇప్పుడు చూడు, రుక్మిణికి చదువు లేకపోవటం వల్ల బంగారం లాంటి సంబంధం తప్పిపోయింది?"

ఊగుతున్న ఉయ్యాల బల్ల ఆగిపోయింది. కానీ రుక్మిణి మనసులో ఉవ్వెత్తున లేస్తున్న ఆలోచనలు మాత్రం ఆగలేదు.

ఆ రోజు కూడా తూర్పునే తెల్లవారింది. కాకుల కలకలారావంతోనే లేచాడు విశ్వనాథం.

"ఏమండీ -- మన రుక్మిణి కనబడటం లేదండీ" అంటున్నది భార్య కంగారుగా.

విశ్వనాథం నిద్ర మత్తు వదిలిపోయింది. గబ గబ అన్ని గదుల్లోనూ, వాకిట్లోనూ. పెరట్లోనూ చూశాడు. ఎక్కడా కనపడలేదు.

దమయంతి మాత్రం నిశ్చితంగా నిద్రపోతున్నది.

అప్పుడే చూశాడు రుక్మిణి మంచం మీద వున్న 'రుక్మిణీ కల్యాణం' పుస్తకాన్ని. దాంట్లో ఏదో కాగితం బయటకు కనబడేటట్టుగా పెట్టి వుంది. తీసి చూశాడు.

అవును అది రుక్మిణి వ్రాసిందే.

నాన్నగారికి,

మీ పాతకాలపు భావాలతో నన్ను చదివించకపోవటమే కాదు, కనీసం లోకజ్ఞానం కూడా లేకుండా పెంచారు. అంతేకాక జాతకాలనీ, గోత్రాలనీ మీ మూఢ నమ్మకాలతో ఇంతవరకు నాకు పెళ్ళి కూడా చేయలేదు. వేరే ఏ వ్యాపకమూ లేని ఆడపిల్ల ఎన్నేళ్ళని ఇంట్లో అలా 'రుక్మిణీ కల్యాణం' చదువుకుంటూ కూర్చోగలదు? 'రుక్మిణీ కల్యాణం' లో ఉన్న సందేశం మొన్న చటుక్కున స్ఫురించింది. అందుకే నేను వెళ్ళి పోతున్నాను. 'లేచి పోయింది' అంటారేమో మీరు. మునసబుగారి అబ్బాయి కృష్ణతో పట్నం వెళ్ళిపోతున్నాను... అక్కడే పెళ్ళి కూడా చేసుకుంటాం. కక్కు వచ్చినా కల్యాణం వచ్చినా ఆగదన్నారు మీరు. కక్కుల దాకా వస్తే, కల్యాణం ఆగకూడదు. అందుకే కల్యాణం కోసం తొందరపడి, వెళ్లిపోతున్నాం. కృష్ణ నన్ను బాగానే పోషించగలడు. నాకు దారి చూపి ధైర్యాన్నిచ్చిన 'రుక్మిణీ కల్యాణం' పుస్తకం నాతో పాటే తీసుకువెడదామనుకున్నాను. కానీ రేపు దమయంతికి కూడా బహుశా ఆ పుస్తకమే మళ్ళీ మార్గం చూపించాల్సి వస్తుందేమో! అందుకే వదిలేస్తున్నాను -- దయచేసి ఆ పుస్తకం దమయంతికి ఇవ్వండి. మీకూ, అమ్మకూ నమస్కారాలతో -- మీ

రుక్మిణి